అద్దె ఇళ్లు.. అరకొర సౌకర్యాలు

- అసౌకర్యాల నడుమ అంగన్‌వాడీ కేంద్రాలు
- చిన్నారులు, గర్భిణులకు ఇబ్బందులు
- సొంత భవనాలు నిర్మించాలని వేడుకోలు

చర్ల: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యలతో సతమతమవుతున్నాయి. కేంద్రాలకు సొంత భవనాలు లేక, కొనసాగుతున్న అద్దె భవనాల్లో వసతులు లేక నానా అవస్థలు పడాల్సి వస్తోంది. దీంతో చిన్నారులను ఆయా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపేందుకు వారి తల్లిదండ్రులు విముఖత చూపుతున్నారు.

48 కేంద్రాలు ప్రైవేటు భవనాల్లోనే..

చర్ల మండలంలో 112 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. వాటిలో 79 మెయిన్, 33 మినీ కేంద్రాలున్నాయి. వీటిలో కేవలం 64 అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉండగా మిగిలిన వాటికి భవనాలు లేవు. భవనాలు లేకుండా ఉన్న 48 కేంద్రాలలో 25 కేంద్రాలు అద్దె భవనాలలో కొనసాగుతుండగా.. మరో 23 కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలలు, గ్రంథాలయ భవనాలు, గ్రామపంచాయతీ కార్యాలయ భవనాల్లో కొనసాగుతున్నాయి. అద్దె భవనాలకు చెల్లిస్తున్న రుసుం అంతంత మాత్రంగానే ఉండడం, అవి కూడా ప్రతి నెలా సక్రమంగా చెల్లించకపోతుండడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలను అద్దెకు ఇచ్చిన యజమానుల నుంచి ఆయా కేంద్రాలలో పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.


రాళ్లగూడెంలో అద్దె ప్రాతిపదికన నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

సౌకర్యాలు అంతంతే..

అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫ్యాన్లు వంటివి లేకపోవడంతో కేంద్రాలకు వస్తున్న బాలింతలు, గర్భిణులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయా గ్రామపంచాయతీల నుంచి తాత్కాలికంగా తాగునీటిని పైపులైన్ల ద్వారా సరఫరా చేస్తున్నప్పటికీ అది అంతంత మాత్రంగానే కొనసాగుతోంది.

పక్కా భవనాల కోసం ఎదురుచూపులు

చర్ల మండలంలో అద్దె, ఇతర ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్న 48 అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాల నిర్మాణం కోసం ఆయా గ్రామాల్లోని గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు ఏళ్ల తరబడిగా ఎదురు చూస్తున్నారు. అయినప్పటికీ నిధులు మంజూరు కాకపోవడం, నిర్మాణాలకు నోచుకోవడం లేదు.

ఇటీవల కందిపాడు, చెన్నాపురం, కలివేరు గ్రామాల్లోని కేంద్రాలకు భవనాలు నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ వాటికి సంబంధించిన టెండర్లు పిలువలేదు.


దేవరాపల్లి-1లో గ్రంథాలయ భవనంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రం

ఉన్నతాధికారులకు నివేదించాం



చర్ల మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేని విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. అద్దె భవనాలో సౌకర్యాలు లేని మాట వాస్తవమే. గ్రామాల్లో సౌకర్యాలు ఉన్న భవనాలు లేకపోవడంతో అరకొర సౌకర్యాలు ఉన్న భవనాలోనే అద్దె ప్రాతిపదికన కేంద్రాలను నిర్వహిస్తున్నాం. బిల్లులు మంజూరు కాకపోతుండడంతో నెల నెలా అద్దె చెల్లించలేకపోతున్నాం. పంపిన నివేదికల ఆధారంగా అధికారులు త్వరలోనే భవనాలు మంజూరు చేసే అవకాశం ఉంది.

– పి.చైతన్య, సీడీపీఓ, ఐసీడీఎస్, చర్ల ప్రాజెక్ట్

క్లుప్తంగా

భద్రాచలం వాసికి నారీరత్న అవార్డు


పద్మావతి

భద్రాచలంఅర్బన్: భద్రాచలానికి చెందిన ఉపాధ్యాయురాలు మరింగంటి పద్మావతికి నారీరత్న అవార్డు లభించింది. ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తూనే సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఆమెకు.. విజయవాడలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యాన అవార్డు ప్రకటించారు. ఈనెల 8న ఆమె అవార్డు అందుకోనున్నారు.

ఉత్తమ అంగన్‌వాడీ టీచర్లకు సన్మానం

అశ్వాపురం: మండలంలో ఉత్తమంగా సేవలు అందించిన అంగన్‌వాడీ టీచర్లకు బూర్గంపాడు ప్రాజెక్ట్ సీడీపీఓ రేవతి సన్మానించారు. మండల కేంద్రంలో రైతువేదికలో గురువారం జరిగిన అంగన్‌వాడీ టీచర్ల ప్రత్యేక సమావేశంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. మల్లెలమడుగు-1 అంగన్‌వాడీ కేంద్రం టీచర్ రెడ్డి అరుణ, అశ్వాపురం ఎస్సీ కాలనీ కేంద్రం టీచర్ సరళ, కల్యాణపురం కేంద్రం టీచర్ వేణికి జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గోదావరి జలాల రాకతో సంబురాలు

చండ్రుగొండ: మండలంలోకి గోదావరి జలాలు ప్రవేశించడంతో బీఆర్‌ఎస్ నాయకులు గురువారం సంబురాలు చేసుకున్నారు. బెండాలపాడు గ్రామ శివారు గుండా ప్రవహిస్తున్న సీతారామ కలువలో గోదావరి జలాలకు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. అనంతరం మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లోని మండలాలకు గోదావరి జలాలు తీసుకువచ్చిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. కార్యక్రమంలో నాయకులు కొడకండ్ల వెంకటరెడ్డి, దారవెంకటేశ్వరరావు, నరుకుళ్ల సత్యనారాయణ, మెడా మోహన్‌రావు, సత్తి నాగేశ్వరరావు, సంగొండి రాఘవులు, చాపలమడుగు రామరాజు, కొళ్ళెం వెంకటేశ్వర్లు, భూపతి శ్రీనివాసరావు, అప్పాజీ, శ్రావణ్ పాల్గొన్నారు.

దాడులకు వ్యతిరేకంగా పోరాడుదాం


మాట్లాడుతున్న ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు దుర్గమ్మ

దమ్మపేట: దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులకు వ్యతిరేకంగా పోరాడుదామని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు తోడెం దుర్గమ్మ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తోడెం దుర్గమ్మ మాట్లాడుతూ.. మహిళలపై ప్రతినిత్యం ఏదో మూల జరుగుతున్న అకృత్యాలు, అత్యాచారాలను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతుందని విమర్శించారు. వీటిని అరికట్టేందుకు ప్రభుత్వం పకడ్బంది చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నూపా సరోజినీ, గంగాధర నాగమణి, ముక్తేశ్వరి, మంగా, జ్యోతి పాల్గొన్నారు.

కేసీహెచ్‌పీ సమస్యల పరిష్కారానికి కృషి

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కేసీహెచ్‌పీలో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు అన్నారు. గురువారం కేసీహెచ్‌పీని సందర్శించిన ఆయన.. కార్మికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎండాకాలం ప్రారంభమైన నేపథ్యంలో కూలర్ల ఏర్పాటు, డస్ట్ నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన దృష్టికి రాగా.. అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో కేసీహెచ్‌పీ పిట్ సెక్రటరీ శ్యాం వర్మ, నరేశ్, అజిత్, సదానందం, శివకుమార్, రమేశ్, డేవిడ్ రాంబాబు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో ఉన్న షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా సాయినాథుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మణుగూరు పట్టణానికి చెందిన కేసీ సుబ్బారావు-నిర్మల దంపతులు, వారి కుమారుడు హరిదీప్-కావ్యాల పెళ్లిరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం అన్నదాత దంపతులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

‘సెంట్రల్’ పనుల పరిశీలన


ములకలపల్లి: సెంట్రల్ లైటింగ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

ములకలపల్లి: ములకలపల్లి చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనులను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రస్తుతం సాగుతున్న బీటీ రోడ్డు విస్తరణ పనులను మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే.. స్థానికులతో మాట్లాడారు. సెంట్రల్ లైటింగ్‌తో మండలకేంద్రం సుందరమయంగా మారుతుందని అన్నారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీ పడొద్దని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. పువ్వాల మంగపతి, మేకల పెద్దవెంకన్న, పద్దం బుజ్జి, వంజరపు ఉమేశ్. సురభి రాజేశ్, బేతాళం వెంకన్నబాబు తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇల్లు శంకుస్థాపన

దమ్మపేట: రాష్ట్ర ప్రభుత్వం చేత మంజూరైన ఇందిరమ్మ ఇంటికి స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గురువారం శంకుస్థాపన చేశారు.మండల పరిధిలోని మొండివర్రె గ్రామపంచాయతీని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా.. ఆ గ్రామానికి చెందిన బేతం రవి-నాగలక్ష్మి దంపతుల ఇంటికి నిర్వహించిన భూమి పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, హౌసింగ్ డీఈ సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ రవీంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ సోయం ప్రసాద్, ఎల్లిన రాఘవరావు, రావు గంగాధరరావు, చిన్నశెట్టి యుగంధర్, ఏఈ రాము, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల విజయోత్సవాలు

చర్ల: రాష్ట్రంలో బీజేపీ రెండు ఎమ్మెల్సీ స్థానాలు దక్కించుకోవడంపై ఆ పార్టీ శ్రేణులు చర్లలో విజయోత్సవాలు జరుపుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు నూపా రమేష్ నేతృత్వంలో టపాసులు కాల్చి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ పట్టు సాధిస్తుందనడానికి రెండు ఎమ్మెల్సీ స్థానాలను సాధించడమే నిదర్శనమని అన్నారు. పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పాహీం, జిల్లా కార్యవర్గ సభ్యుడు గూనూరి రమణ, సీనియర్ నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, ఇర్పా సుబ్బారావు, తరుణ్‌రెడ్డి, బందా మధు, శ్రీనివాసాచారి, విశ్వనాథం, కుప్పా మాదవరావు, ప్రశాంత్, సాయి, వినోద్ పాల్గొన్నారు.

మణుగూరురూరల్: రాష్ట్రంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు మలక కొమరయ్య, అంజిరెడ్డిలు గెలుపొందడంపై ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఈసాల వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతోందని, నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ రోజురోజుకు తన బలాన్ని పెంచుకుంటూ ముందుకు దూసుకుపోతోందని అన్నారు.


చర్ల: విజయోత్సవ సంబురాలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఫీజును పునఃపరిశీలించాలి


కమిషనర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

మణుగూరుటౌన్: హైకోర్టు తీర్పు వచ్చే వరకు ట్రేడ్ లైసెన్స్ ఫీజును పునఃపరిశీలించాలని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు గురువారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చాంబర్ కామర్స్ ప్రతినిధులు మాట్లాడుతూ.. వ్యాపారాలు నడవక ఆర్థిక ఒత్తిడితో ఉన్న వ్యాపారులపై ట్రేడ్ లైసెన్స్ ఫీజులు విధించడం మరింత భారం పడుతోందన్నారు. మణుగూరు మున్సిపాలిటీగా కొనసాగాలా గ్రామ పంచాయతీగా కొనసాగేనా అన్న అంశం కోర్టు పరిధిలో ఉండటంతో తీర్పు వెలువరించే వరకు ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూళ్లను తాత్కాలికంగా నిలిపివేయాలని కోరారు. దోసపాటి వెంకటేశ్వరరావు, దండా రాధాకృష్ణ తదితరులు కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

వసతులు కల్పించండి

మణుగూరుటౌన్: నియోజకవర్గంలోని ఆదివాసీ గ్రామాలకు మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతూ.. ఇఫ్టూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు తన నివాసంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నాసర్‌పాషా మాట్లాడుతూ.. పినపాక, అశ్వాపురం, మణుగూరు మండలాల్లో పలు గిరిజన, ఆదివాసీ గ్రామాలకు తాగునీరు, రోడ్డు, విద్యుత్ సౌకర్యం లేవని ఆవేదన వ్యక్తం చేశారు. బుగ్గ, ఖమ్మంతోగు, బుడుగుల గ్రామాలకు రహదారి లేదని, పెద్దిపల్లి తాగునీరు లేక అవస్థలు పడుతున్నారన్నారని వివరించారు. నాయకులు మిడిదొడ్ల నాగేశ్వరరావు, అంగోతఖ మంగీలాల్, గణేశ్ రెడ్డి, నరేశ్, గుండి భీమయ్య, కుంజా రమేశ్, కల్తీ చుక్కయ్య. కుంజా శంకర్, కుంజా కుమార్, వజ్జా దేవా, కోవాసి జోగా, ఎట్టిదేవా తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

ఎట్టకేలకు గుంతల పూడ్చివేత


మలుపు వద్ద గుంతలను పూడ్చి, బీటీ నిర్మిస్తున్న దృశ్యం

అశ్వారావుపేటరూరల్: జాతీయ రహదారి, మూలమలుపు వద్ద గత కొద్ది నెలలుగా ఉన్న భారీ గుంతల వద్ద ఎట్టకేలకు గురువారం మరమ్మతులు చేపట్టారు. ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారిలో అశ్వారావుపేటలోని రింగ్‌రోడ్ సెంటర్‌లో ఉన్న మలుపు దగ్గర రహదారి దెబ్బతిని భారీ గుంతలు పడ్డాయి. దీంతో పెద్ద పెద్ద వాహనాలు అదుపు తప్పి బోల్తా పడుతున్నాయి. గడిచిన ఆరు నెలల కాలంలో మూడు నుంచి ఐదు లారీలు బోల్తా పడగా, సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. ఎట్టకేలకు స్థానిక రోడ్లు భవనాల శాఖ అధికారులు గుంతలను పూడ్చి వేసి, బీటీ నిర్మాణం చేస్తున్నారు. దీంతో వాహనదారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హాస్టల్‌లో శుభ్రం చేయాలని తీర్పు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి శివ నాయక్ గురువారం వినూత్న తీర్పును ఇచ్చారు. భద్రాచలం టౌన్, బూర్గంపాడు పోలీస్ స్టేషన్లతో పాటు భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి కోడి పందాలు పేకాట, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ముద్దాయిలకు జరిమానా విధించారు. అంతే కాకుండా కమ్యూనిటీ సర్వీస్‌లో భాగంగా పట్టణంలోని ఎస్టీ బాలుర గృహం, పరిసరాలను శుభ్రం చేయాలని న్యాయమూర్తి సూచించారు. ఆ మేరకు ముద్దాయిలు హాస్టల్ పరిసరాలను శుభ్రం చేశారు.

నిద్రమాత్రలు మింగిన నర్సింగ్ విద్యార్థిని?

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని ఓ నర్సింగ్ కళాశాలకు చెందిన విద్యార్థిని నిద్రమాత్రలు మింగినట్లు తెలిసింది. దీంతో అపస్మారక స్థితికి చేరిన ఆ విద్యార్థినిని భద్రాచలంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి బయటకు విషయం తెలియకుండా యాజమాన్యం జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణానికి చెందిన ఓ యువతి అదృశ్యమైన ఘటనపై గురువారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పట్టణంలోని ఓ కాలనీకి చెందిన యువతి బుధవారం నుంచి కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వాకబు చేసినప్పటికీ ఆచూకీ తెలియలేదు. దీంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు.

నేడు తిరు కల్యాణం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని శ్రీకృష్ణ దేవాలయం ఆధ్వర్యంలో శుక్రవారం తిరుకల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 8 గంటలకు అభిషేకంతో ప్రారంభమై అలంకరణ, పూజలతో.. సాయంత్రం 6 గంటలకు కల్యాణం ప్రారంభమవుతుందని తెలిపింది. భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించాలని, అన్నదానం స్వీకరించాలని కోరింది.

బీఎస్పీలో చేరిక

దుమ్ముగూడెం: మండలంలోని చింతగుప్ప గ్రామంలో గురువారం బహుజన్ సమాజ్ పార్టీలో పలువురు చేరారు. బహుజన్ సమాజ్ పార్టీ నిర్మాణ కార్యక్రమంలో భాగంగా మండలంలో పర్యటించిన బీఎస్పీ నాయకులు చింతగుప్ప గ్రామానికి చెందిన తుర్రం రాజు, పెడకం రాజేష్, పాయం బాలరాజు పలువురు ఆదివాసీ యువకులు బహుజన్ సమాజ్ పార్టీ మండల అదనపు ఇన్‌చార్జ్ చల్లగుల్ల సతీష్ చౌదరి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరికి జిల్లా ఇన్‌చార్జ్ తడికల శివకుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. భద్రాచలం నియోజకవర్గ అధ్యక్షుడు కొండా చరణ్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సామల ప్రవీణ్, పలువురు బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

మణుగూరుటౌన్: పాత మణుగూరులో కొలువైన నీలకంఠేశ్వరాలయ హుండీ లెక్కింపు కార్యక్రమం గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కూచిపూడి బాబు, ఆలయ కమిటీ సమక్షంలో లెక్కించగా.. రూ.లక్షా 31వేల 519 వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ కార్యనిర్వహణ అధికారి సుదర్శన్ పర్యవేక్షించారు.

ఆదివాసీ గ్రామాల్లో ఏఎస్పీ పర్యటన

చర్ల: మండలంలోని మారుమూల ఆదివాసీ గ్రామాల్లో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ గురువారం పర్యటించారు. మండలంలోని మారుమూల గ్రామాలైన బట్టీగూడెం, రామచంద్రాపురం గ్రామాల్లో ప్రత్యేక బలగాల భద్రత నడుమ పర్యటించిన ఆయన.. ప్రతీ ఇంటినీ సందర్శించి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. గ్రామాల్లోకి కొత్త వ్యక్తులను రానీయవద్దని, వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఆదివాసీలకు సూచించారు. అభివృద్ధి నిరోధకులుగా ఉన్న మావోయిస్టులకు సహకరించవద్దని, సహకరించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గ్రామాల్లో విద్య, వైద్య, రహదార్లు, కమ్యునికేషన్ వంటి సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఏఎస్పీ వెంట సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ రాజ్‌కుమార్, చర్ల సీఐ ఏ రాజువర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్ పాల్గొన్నారు.


ఆదివాసీలతో మాట్లాడుతున్న భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

మణుగూరురూరల్: ప్రతీ ఒక్కరూ సీపీఆర్ విధానంపై అవగాహన కలిగి ఉండాలని బీటీపీఎస్ అసిస్టెంట్ కమాండెంట్ తిరుపతయ్య తెలిపారు. మండల పరిధిలోని చిక్కుడు గ్రామంలో భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం అసిస్టెంట్ కమాండెంట్ ఆధ్వర్యంలో ఉద్యోగులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీటీపీఎస్ వైద్యులు మనోహర్, మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు నిఖిల్‌లు ప్లాంట్ ఉద్యోగులకు, కార్మికులకు సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించారు. గుండెపోటులో ఊపిరి ఆగిపోయిన వారికి పునర్జన్మ ప్రసాదించేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. అనంతరం వైద్యులు సీపీఆర్ విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. ఈ కార్యక్రమంలో బీటీపీఎస్ ఉద్యోగులు, కార్మికులు, భద్రతాధికారులు పాల్గొన్నారు.


ప్రత్యక్షంగా సీపీఆర్ చేసి చూపిస్తున్న వైద్యుడు

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు


అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న లచ్చిరెడ్డి-చంద్రకళ దంపతులు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో నూతనంగా సీతారామచంద్రస్వామి నిర్మాణం పూర్తి అయ్యి.. ఈ నెల 9న విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టనుండగా.. మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గురువారం యాగశాలలో భక్తులు భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. భక్తులకు ఎన్‌ఆర్‌ఐ ముద్దం ప్రవీణ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన తల్లిదండ్రులు లచ్చిరెడ్డి-చంద్రకళ దంపతులు రెండు పూటలు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు లచ్చిరెడ్డి-చంద్రకళ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ మర్రి మల్లారెడ్డి, సమన్వయకర్త తిప్పరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, ఎన్‌ఆర్‌ఐ కందిమళ్ల సత్యనారాయణరెడ్డి, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రామాలయ ఈఓకు ఆహ్వానం

మొండికుంట గ్రామంలో ఈ నెల 9న చేపట్టనున్న విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా.. భద్రాచలం రామాలయం ఈఓ రమాదేవిని ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఆహ్వానించారు. ఈ మేరకు భద్రాచలంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వాన పత్రిక అందజేశారు. భద్రాచలం ప్రముఖ వైద్యులు మోహన్‌రావు, రాజశేఖర్, అశ్వాపురం ఎంపీడీఓ వరప్రసాద్, తహసీల్దార్ స్వర్ణలత, మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావుతో పాటు పలువురు నాయకులను కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు.

పాఠశాలల పరిశీలన


మాధారం పాఠశాలలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ములకలపల్లి: మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలను జిల్లా విద్యాశాఖ బాధ్యులు గురువారం పరిశీలించారు. జిల్లా కో-ఆర్డినేటర్లు ఎస్.సతీశ్‌కుమార్, ఎస్.సైదులు మాధారం ప్రాథమికోన్నత పాఠశాల, విజయపురి కాలనీ, ములకలపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అక్కడి మౌలిక వసతులు ఎలా ఉన్నాయో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎమ్మార్సీలో సమీక్ష నిర్వహించారు. తుది నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు జిల్లా కోఆర్డినేటర్లు తెలిపారు. ఎంఈఓ సత్యనారాయణ, కాంప్లెక్స్ హెచ్‌ఎం లత. టీజీడబ్ల్యూఐడీసీ ఏఈ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు అధ్యక్షుడిగా కిరణ్


తుమ్మల కిరణ్‌కు నియామక పత్రం అందిస్తున్న జిల్లా నాయకులు

బూర్గంపాడు: మాల మహానాడు పినపాక నియోజకవర్గ అధ్యక్షుడిగా సారపాకకు చెందిన తుమ్మల కిరణ్ నియమితులయ్యారు. సారపాకలో గురువారం జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పూల రవీందర్, ప్రధాన కార్యదర్శి అల్లాడి పాల్‌రాజ్‌లు కిరణ్‌కు నియామకపు పత్రాలను అందించారు. నాయకులు భూపెల్లి నర్సింహారావు, గుర్రాల సుదర్శన్, కొట్టె అనిల్, ఇలంగి లాలయ్య, బర్ల రామకృష్ణ, దారా కార్తీక్, పాటి అశోక్ పాల్గొన్నారు.

ప్రతిభను గుర్తించాలి

అశ్వారావుపేటరూరల్: ప్రతి విద్యార్థిలోనూ ప్రతిభ దాగి ఉంటుందని, దాన్ని బయటకు తీసి గుర్తించాలని స్థానిక ఎంఈఓ పొన్నగంటి ప్రసాద్‌రావు అన్నారు. అశ్వారావుపేట కాంప్లెక్స్ పరిధిలోని నెహ్రూనగర్ పాఠశాలలో గురువారం మండల స్థాయి ప్రతిభ పాటవ పోటీలను నిర్వహించారు. విద్యార్థులకు ఉపన్యాసాలు, కథలు, వ్యాస రచన, క్విజ్, గణిత, చిత్రలేఖనం, పాటల పోటీలను నిర్వహించారు. కాంప్లెక్స్ స్థాయిలో విద్యార్థులు పాల్గొని ప్రతిభను కనబరచగా.. ఎంఈఓ చేతుల మీదుగా వారికి ధ్రువీకరణ పత్రాలను అందించారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

9న ఐలయ్య సంస్మరణ సభ

దుమ్ముగూడెం: దివంగత నేత కాసాని ఐలయ్య సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని పెద్ద బండిరేవు గ్రామంలో ఈనెల 9వ తేదీన జరిగే కాసాని ఐలయ్య సంస్మరణ సభ వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. సభలో పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు మర్మం చంద్రయ్య, మండల కమిటీ సభ్యులు సోయం వీర్రాజు, శాఖ కార్యదర్శి పాయం హరిబాబు, కనకారావు, రాము పాల్గొన్నారు.

సజావుగా ‘ద్వితీయ’ పరీక్షలు

ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉపాధ్యాయులు విద్యార్థుల హాల్‌టికెట్‌లు పరిశీలించి కేంద్రంలోకి పంపారు. తొలి రోజు తెలుగు, హిందీ, సంస్కృతం పరీక్ష నిర్వహించారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో తగు వసతులు కల్పించినట్లు సంబంధిత అధ్యాపకులు తెలిపారు. పోలీసులు పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు. కాగా, ఆయా సెంటర్లలోని పలువురు విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలుస్తోంది.

– సాక్షి నెట్‌వర్క్


దుమ్ముగూడెం: పరీక్ష రాసేందుకు కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు


చండ్రుగొండ: ఎస్‌ఐ శివరామకృష్ణకు సూచనలు చేస్తున్న డీఎస్పీ అబ్దుల్‌రెహమాన్